సాక్షి
బాపట్ల
గురువారం । 15 । మే । 2025



పండ్ల తోటలపై శిక్షణ

వినుకొండ: పండ్ల తోటలపై రైతుల గుర్తింపు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. హార్టికల్చర్ ఆఫీసర్ నబీరసూల్, ఏవో జి.వరలక్ష్మి పాల్గొన్నారు.



నేడు ప్రతిష్ఠా మహోత్సవం

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి హరిజన వాడలో క్రీస్తు కృప లూథరన్ దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవం గురువారం జరగనుంది.



హుండీ కానుకలు లెక్కింపు

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. రూ.14.28 లక్షలు వచ్చినట్లు సహాయ కార్యదర్శి తిమ్మనాయుడు తెలిపారు.

అవిశ్వాసపాత్రుడికి వెన్నుపోటు!

వంచనకు, వెన్నుపోటుకు మారు పేరు ఆ పార్టీ. ఆ పార్టీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును సైతం విమర్శకులు, రాజకీయ విశ్లేషకులు చాలా మంది అదే పేరుతో సంబోధించడం తెలిసిందే! అలాంటి పార్టీని, అధినేతను నమ్మి చేరితే వెన్నుపోటు, భంగపాటు తప్ప ఏం జరుగుతుంది? ఇప్పుడు చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు అచ్చం అలాగే జరిగింది. వైఎస్సార్ సీపీలో మెజార్టీ కౌన్సిలర్ల మద్దతుతో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన వ్యక్తి.. అనైతికంగా సొంత పార్టీకి వెన్నుపోటు పొడిచి పచ్చ పార్టీలో చేరి పట్టుమని 15 రోజులు ముగియకుండానే అదే వెన్నుపోటుకు బలయ్యారు. ఇప్పుడు చీరాలతో పాటు జిల్లాలో ఇదే చర్చనీయాంశంగా మారింది. జంజనంకు ఇలా జరగాల్సిందేనని పార్టీలకతీతంగా అందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- చీరాల మున్సిపల్ చైర్మన్‌పై పచ్చ పార్టీ అవిశ్వాసం
- రాజకీయంగా పదవి ఇచ్చిన వైఎస్సార్‌సీపీకి ద్రోహం
- పదవి కోసం అనైతికంగా టీడీపీలో చేరిన జంజనం
- అవిశ్వాసానికే మొగ్గిన ఎమ్మెల్యే, పచ్చ పార్టీ కౌన్సిలర్లు
- పార్టీ మారినా చైర్మన్ పదవి ఇచ్చేది లేదన్న కౌన్సిలర్లు
- పదవి కోసం రేసులో ముగ్గురు కౌన్సిలర్లు.. ఎటూ తేలని పంచాయితీ
- రెంటికీ చెడ్డ రేవడిలా జంజనం పరిస్థితి





చీరాల మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి అనుకూలంగా ఓటింగ్‌లో పాల్గొన్న కౌన్సిలర్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: గత నెల 30వ తేదీన పచ్చ కండువా కప్పుకొన్న చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు ఆ పదవిని పచ్చపార్టీ నిర్దయగా పీకేసింది. పదవిని నిలబెట్టుకునేందుకు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచి పచ్చ పార్టీ తీర్థం పుచ్చుకున్న జంజనం.. అదే తరహాలో పచ్చపార్టీ పదవి ఊడగొట్టింది. దీంతో జంజనం ఇప్పుడు రెంటికీ చెడ్డరేవడిలా మారారు. జంజనంకు వ్యతిరేకంగా సాక్షాత్తు ఆ పార్టీ ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, చీరాల ఎమ్మెల్యే కొండయ్యలు చేతులెత్తి మరీ ఓటు వేయడం ఇక్కడ గమనార్హం. ఈ విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గతంలో చీరాల మున్సిపాలిటీలో 33 మంది కౌన్సిలర్లు ఉండగా.. అత్యధికంగా 22 స్థానాలు గెలుచుకొని వైఎస్ఆర్ సీపీ మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకుంది. జంజనం శ్రీనివాసరావును చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

కూటమి రాకతో కుట్రలు

కూటమి అధికారంలోకి రావడం, చీరాల ఎమ్మెల్యేగా పచ్చ పార్టీకి చెందిన ఎం.ఎం.కొండయ్య ఎన్నిక కావడంతో అధికారం అడ్డుపెట్టి మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు కూటమి కుట్రలకు తెరతీసింది. ప్రలోభాలకు తలొగ్గి వైఎస్సార్‌సీపీ, మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గాలకు చెందిన 22 మంది పచ్చ పార్టీలోకి వెళ్లారు. దీంతో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావును పదవి నుంచి దించేందుకు పచ్చపార్టీ నేతలు రంగం సిద్ధం చేశారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సూచనతో అవిశ్వాసం కోసం గత నెల 23న జిల్లా కలెక్టర్ వెంకట మురళికి లేఖ ఇచ్చారు. దీంతో కలెక్టర్ మే నెల 14వ తేదీన బలనిరూపణకు గడువు పెట్టారు. పదవి నిలబెట్టుకునేందుకు చైర్మన్ జంజనం పచ్చపార్టీ పంచన చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే, ఇతర పెద్దలతో మంతనాలు సాగించి ఎట్టకేలకు ఏప్రిల్ నెల 30వ తేదీన ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుల సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ మారినా ఆయనకు ప్రయోజనం లేకుండా పోయింది. ఎమ్మెల్యే, కౌన్సిలర్లు ఆయన చైర్మన్ పదవిలో కొనసాగేందుకు ససేమిరా అన్నారు. దీంతో బుధవారం అవిశ్వాసం పెట్టారు. అవమానభారం తట్టుకోలేక చైర్మన్ జంజనం అవిశ్వాస తీర్మానం మొదలయ్యే పదిహేను నిమిషాల ముందే పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. సాంకేతికంగా అది కుదరలేదు. చైర్మన్‌పై అవిశ్వాసం కొనసాగింది. ఐనా ఎమ్మెల్యే, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే నడుచుకుంటానని ఏడవలేక నవ్వినట్టు గంభీరపు సందేశం ఇచ్చారు.

వ్యతిరేకంగా ఎంపీ, ఎమ్మెల్యేలు

జంజనం శ్రీనివాసరావు గత నెల 30న టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం జరిగిన అవిశ్వాసంలో సాక్షాత్తూ ఆ పార్టీ బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్యలు జంజనంకు వ్యతిరేకంగా చేతులెత్తి మరీ ఓట్లు వేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ సన్నివేశం చూసిన చీరాల వాసులు నవ్వి పోతున్నారు. పదవి ఇచ్చి గౌరవించిన పార్టీకి వెన్నుపోటు పొడిచిన జంజనంకు అదే పరిస్థితి వచ్చిందని, పార్టీలో చేర్చుకొని పచ్చపార్టీ తగిన బుద్ధి చెప్పిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

లోకేష్ చెప్పడంతోనే..

చీరాల: మంత్రి లోకేష్ చెప్పడంతోనే తాను మున్సిపల్ చైర్మన్ పదవికి రాజీనామా చేశానని, రానున్న రోజుల్లో టీడీపీతో తన పయనం ఉంటుందని జంజనం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ నుంచే తన రాజకీయ ప్రస్థానం మొదలైందన్నారు.

పచ్చ పార్టీలో మొదలైన లొల్లి

మున్సిపల్ చైర్మన్ అవిశ్వాసం వ్యవహారం చీరాల పచ్చ పార్టీలోనూ అసంతృప్తులు రాజేసింది. కౌన్సిలర్లు అవిశ్వాసం కోసం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగానే పచ్చ పార్టీ చీరాల పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెరపైకి వచ్చారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం అవసరం లేదని ప్రకటించడంతో ఆ పార్టీలోని లుకలుకలు రోడ్డునపడ్డాయి. మరోవైపు చైర్మన్ పదవి కోసం కౌన్సిలర్లు యాదవ సామాజికవర్గానికి చెందిన సాంబశివరావు, గౌడ వర్గానికి చెందిన ఎస్.లక్ష్మి, వైశ్య వర్గానికి చెందిన సుబ్బయ్యలు పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే మద్దతు కోసం కొందరు, ఆయన తనయుడి ఆశీర్వాదం కోసం ఇంకొందరు పోటీలు పడుతున్నారు. ఇప్పుడు అవిశ్వాసం కూడా ముగియడంతో చైర్మన్ గొడవ ఊపందుకోనుంది. మున్సిపాలిటీని వారం రోజులపాటు ప్రత్యేక అధికారి పాలనలో ఉంచి చైర్మన్ ఎన్నికకు వెళ్లాలని ఎమ్మెల్యే భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు చైర్మన్ పదవి కోసం ఒక్కో కౌన్సిలర్ సుమారు రూ. 7 లక్షలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ లెక్కన రూ. కోట్లలోనే ఆశావహులు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంత మొత్తం వెచ్చించినా చైర్మన్ పదవి ఇంకా కేవలం 8 నెలలే ఉండడంతో కొందరు ఆలోచనలో పడుతున్నట్లు సమాచారం. పదవి ఎవరికి ఇచ్చినా మిగిలిన ఆశావహులు అలకబూనే పరిస్థితి కనపడుతోంది. ఇదే అవకాశంగా మాజీ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు సైతం తన వర్గాన్ని ఎగదోసే పరిస్థితి కనిపిస్తోంది. మొత్తంగా అవిశ్వాసం వ్యవహారం చీరాల పచ్చపార్టీలో మరింతగా అగ్గి రాజేసినట్లేనని పరిశీలకులు భావిస్తున్నారు.

న్యూస్‌రీల్

కల్తీ ఆహార విక్రయాలపై కఠిన చర్యలు



వేటపాలెం: కల్తీ ఆహారం విక్రయించే హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ హెచ్చరించారు. వేటపాలెం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద గల గాయిత్రి బిర్యాని హోటల్‌లో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చికెన్, మటన్, పలావుల్లో కల్తీ ఉన్నట్లు తరచూ ఆరోపణలు రావడంతో తనిఖీలు చేశామన్నారు. హోటల్ ప్రాంగణంలో అపరిశుభ్రంగా ఉందని, నిల్వ ఉంచిన మాంసాన్ని వండి విక్రయిస్తున్నట్లు సమాచారం అందిన్నట్లు తెలిపారు. హోటల్‌లోని చికెన్, మటన్, ఇతర పదార్థాలను, వంట నూనెలను ఆయన పరిశీలించారు.

పాలిసెట్‌లో జిల్లా విద్యార్థికి రాష్ట్ర స్థాయి ర్యాంకు

బల్లికురవ: పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఫలితాల్లో బల్లికురవ మండలంలోని కొప్పరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి కంభాల నాగసాయి చరణ్‌తేజ రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించినట్లు ఆ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. 120 మార్కులకు జరిగిన ఈ పరీక్షలో 119 మార్కులు కైవసం చేసుకుని రాష్ట్రస్థాయిలో 69వ ర్యాంకు, బాపట్ల జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఇటీవల విడుదల అయిన పదో తరగతి ఫలితాల్లో 590 మార్కులు పొందిన చరణ్‌తేజ మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విషయం విదితమే. చరణ్‌తేజను పాఠశాల ఉపాధ్యాయులు, సీఎంసీ, గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు.

హోమ్స్‌ను సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



గుంటూరు లీగల్: క్యాలెండర్ యాక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు బుధవారం గుంటూరులోని హోమ్స్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ సందర్శించారు. దిశా వన్ స్టాప్ సెంటర్, శిశు గృహం, స్వధార్ హోమ్, లీమా డెఫ్ అండ్ డమ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. అక్కడున్న అధికారులతో మాట్లాడారు. పిల్లలకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, రూంలను పరిశీలించారు. దిశా వన్ స్టాప్ సెంటర్, స్వధార్ హోమ్‌లో మహిళలకు అందుతున్న సదుపాయాల గురించి వాకబు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఫ్రీ లీగల్ ఎయిడ్, బాధిత మహిళలకు అందే పరిహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, హోమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన అవసరం



గుంటూరు వెస్ట్: ప్రకృతి వైపరీత్యాలు, భారీ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కనీస అవగాహన ఉంటే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) షేక్ ఖాజావలి అన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో బుధవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌లో ఆయన మాట్లాడారు. ప్రమాదాలు జరిగినప్పుడు భయాందోళనకు గురికాకూడదని తెలిపారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వీలైనంత వరకు నష్టం తగ్గించడం మాక్ డ్రిల్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఫైర్ వస్తోందని తెలుసుకోవడానికి ముందుగా పొగను గుర్తించాలని, ఆ సమయంలో ఇంట్లో ఉన్నవారంతా బయటకు వచ్చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.లక్ష్మీకుమారి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: భూముల రీ సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి సూచించారు. భూ పరిపాలన శాఖ అడిషనల్ కమిషనర్ ప్రభాకర్ రెడ్డి కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లాలలోని అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం జరిగింది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలలో రీ సర్వే కార్యక్రమాన్ని వెంటనే పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. రేపల్లె డివిజన్‌కు సంబంధించి 100 మంది లబ్ధిదారులు డొంక పోరంబోకు భూములను ఆక్రమించుకుని నివాసం ఉంటున్నారనే సమాచారం మేరకు వారి వివరాలు సేకరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని నివాసం ఏర్పాటు చేసుకున్న వారికి పట్టాల మంజూరు నిమిత్తం ప్రతిపాదనలు తయారు చేసి పంపాల్సిందిగా సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు అభినందన

ప్రభుత్వ వసతి గృహాలలోని విద్యార్థులు ఆణిముత్యాలుగా ఎదిగారని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అభినందించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ అవార్డులు, పతకాలను ప్రదానం చేశారు. ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. రేపల్లె ప్రభుత్వ కళాశాల వసతి గృహంలో ఉండి 973 మార్కులు సాధించిన ఇంటర్ విద్యార్థి సీహెచ్ బసవయ్యను కలెక్టర్ సత్కరించారు. కళాశాల వసతి గృహాల కేటగిరీలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానం సాధించడంతో అభినందించారు. రూ.15 వేల నగదు బహుమతిని అందజేశారు. మంచి మార్కులు సాధించిన పలువురు విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. చీరాల ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోని ఆరు వసతి గృహాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు సహాయ ఎస్సీ సంక్షేమ అధికారి చిన్న సైదారెడ్డిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె రాజదెబోరా, పర్యవేక్షకులు ఆంధ్ర శ్రీనివాసులు, ఏఎస్‌డబ్ల్యూఓలు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతులపై అపోహలు వీడండి

టౌన్ ప్లానింగ్ గుంటూరు రీజినల్ డెప్యూటీ డైరెక్టర్ మధుకుమార్



కమిషనర్ శేషన్నతో మాట్లాడుతున్న డీడీ

తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన భవన నిర్మాణాల అనుమతులపై అనేక అపోహలున్నాయని, వాటిని వీడాలని టౌన్ ప్లానింగ్ విభాగ గుంటూరు రీజినల్ డెప్యూటీ డైరెక్టర్ మధుకుమార్ పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ముందుకు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం పట్టణ పరిధిలోని పలు సచివాలయాలను పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన నూతన నిబంధనల వల్ల ఎటువంటి నష్టం లేదన్నారు. లైసెన్స్ సర్వేయర్లు కొందరు దీనిపై అపోహలు సృష్టించారని ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రంలో అన్ని చోట్లా ప్లాన్‌ల దరఖాస్తు ప్రక్రియ నిలచిపోయిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని పట్టణాల్లో ఫ్లెక్సీలు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనధికార కట్టడాలపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ అయితే వారిపై కూడా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా తెనాలి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ జేపీ రెడ్డి, తెనాలి అసిస్టెంట్ సిటీ ప్లానర్లు శివన్నారాయణ, వాణి, టీపీవో సాంబశివరావు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ భూతంపై యుద్ధం

- జిల్లావ్యాప్తంగా ఉచితంగా వైద్య పరీక్షలు
- ఏడాదిలో 490 గ్రామాల్లో సర్వేతో బాధితుల గుర్తింపు
- 825 పాఠశాలల్లో స్క్రీనింగ్ పరీక్షలు
- ఫ్లోరోసిస్ రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యుల సూచన



ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యాలయం

గుంటూరు మెడికల్: వయస్సుతో సంబంధం లేకుండా నేడు పలువురు ఫ్లోరోసిస్‌తో అనారోగ్యానికి గురవుతున్నారు. సమస్యను నియంత్రణలో పెట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా జిల్లా వ్యాప్తంగా వైద్య పరీక్షలు చేయిస్తోంది. ముఖ్యంగా జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేక సిబ్బందితో వైద్య పరీక్షలు చేయిస్తోంది. మందులు కూడా ఉచితంగా అందజేస్తోంది. ఫ్లోరోసిస్ సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా వచ్చే ఇతర అనారోగ్య సమస్యలను పూర్తిగా కట్టడి చేయవచ్చు. ఫ్లోరోసిస్ మహమ్మారిని కట్టడి చేయడమే ధ్యేయంగా జరుగుతున్న స్క్రీనింగ్ పరీక్షలను ప్రతి ఒక్కరూ వినియోగించుకొని, వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారులు సూచిస్తున్నారు.

2013లో నివారణ కార్యక్రమం ప్రారంభం


ఫ్లోరోసిస్ బారిన పడకుండా ప్రజలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమాన్ని 2013లో ప్రారంభించింది. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం 2014 జూన్ నుండి అమల్లోకి వచ్చింది. ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో 2014 నుంచి నేటి వరకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి బాధితులను గుర్తిస్తూనే ఉన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి దంత ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారణ చేశారు.

490 గ్రామాల్లో ఫ్లోరోసిస్ ప్రభావం

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 46 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 490 గ్రామాల ప్రజలు ఫ్లోరోసిస్ వ్యాధిబారిన పడి, అవస్థలు పడుతున్నారు.
- జిల్లాలోని నూజెండ్ల, వినుకొండ, ఏనుగుపాలెం, కొచ్చర్ల, రెడ్డిపాలెం, రొంపిచర్ల, బొల్లాపల్లి, శావల్యాపురం, ఈపూరు, కోటప్పకొండ, అత్తలూరు, 75 త్యాళ్లూరు, క్రోసూరు, అచ్చంపేట, రాజుపాలెం, చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అత్యధిక సంఖ్యలో బాధితులు ఉన్నారు.
- జిల్లాలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు 81 గ్రామాలు, పల్నాడు జిల్లాలో 409 గ్రామాలు కలిపి మొత్తం 490 గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించారు.
- 19,682 ఇళ్లను సర్వే చేశారు. 47,854 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 2,370 మంది అనుమానిత డెంటల్ ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడినట్లు నిర్ధారించారు.
- మెరుగైన వైద్య పరీక్షలు చేసి 509 మంది ఫ్లోరోసిస్ బారిన పడినట్లు తేల్చారు.
- ఉమ్మడి గుంటూరుజిల్లా వ్యాప్తంగా 825 పాఠశాలల్లో 24,612 మంది విద్యార్థులను పరీక్షించారు. ఇందులో 1,783 మంది అనుమానిత దంత ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. మెరుగైన వైద్య పరీక్షలు చేసి 974 మంది విద్యార్థులు ఫ్లోరిసిస్ బారిన పడినట్లు నిర్ధారించారు.

ఫ్లోరోసిస్ రాకుండా జాగ్రత్తలు ఇవి

- ఫ్లోరైడ్‌తో కలుషితమైన నీటిని తీసుకోకూడదు.
- అధికంగా ఉన్న ప్రదేశాల్లో పండిన కూరగాయలు, పాలు, టీ, మాంస ఉత్పత్తులు తీసుకోకూడదు.
- బ్లాక్ టీ, సుపారి, రాక్ సాల్ట్, పాన్‌పరాగ్, పొగాకు వాడకూడదు.
- ఫ్లోరైడ్ కల్గిన టూత్ పేస్టులు, మౌత్‌వాష్ వాడరాదు.
- అల్యూమినియం పాత్రలను వంట చేసేందుకు వాడకూడదు.
- రక్షిత మంచినీటిని తాగాలి.
- పాలు, పెరుగు, జున్ను, బెల్లం, పచ్చటి ఆకు కూరలు,జీలకర్ర, మునగకాడలు, ఉసిరి, జామ, నిమ్మ, నారింజ, టమాటా, పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, వెల్లుల్లి, అల్లం, ఉల్లి తీసుకోవాలి.
- క్యారెట్, బొప్పాయి, చిలకడ దుంపలు ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణకు దోహదపడతాయి



అవగాహన కరపత్రం

ఉచితంగా వైద్య పరీక్షలు



ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు వివరించి, బాధితులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నాం. పాఠశాలల విద్యార్థులకు మందులు, విటమిన్ సీ బిళ్లలు కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 3,504 మంది ఫ్లోరైడ్ బాధితులకు నెక్ బెల్ట్, నడుం బెల్ట్, వాకింగ్ స్టిక్, ఫ్లోల్డింగ్ టాయిలెట్ చైర్ కిట్‌ను ఉచితంగా అందించాం. వ్యాధిపై అవగాహన కలిగేలా 1,315 ప్రాంతాల్లో పోస్టర్లు అంటించాం. మెడికల్ ఆఫీసర్లు 42 మందికి, పారా మెడికల్ సిబ్బంది 84 మందికి, హెల్త్ వర్కర్లు 335 మందికి, ఆశా వర్కర్లకు 980 మందికి ఫ్లోరోసిస్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించేలా నైపుణ్యం పెంపొందించాం.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, గుంటూరు

ఫ్లోరోసిస్‌తో అనర్థాలు



ఎముకల ఫ్లోరోసిస్‌తో కాళ్లు, చేతులు వంకరపోవడం, వెన్నుముక కట్టెల్లా బిగుసుపోవడం, కండరాలు, లిగమెంట్స్, కణజాలాలు, ఎర్ర రక్తకణాలు, వీర్య కణాలు, ఉదర భాగంలోని జీర్ణవ్యవస్థపై దీని ప్రభావం కనిపిస్తుంది. ఎముకలు పెలుసుబారిపోతాయి. దంత ఫ్లోరోసిస్ వల్ల పళ్లు పసుపు లేదా గోధుమ రంగు నుంచి నలుపుగా మారతాయి. ఫ్లోరోసిస్ నీటిని తాగడం వల్ల వెన్నముకలో ఉండే లిగమెంట్స్ ఉబ్బిపోతాయి. వెన్నుముకపై నరాలు ఒత్తుకుని కాళ్లు, చేతులు తిమ్మిర్లు వస్తాయి. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంటుంది. గర్భవతులకు పరీక్షలు చేయడం వల్ల పుట్టబోయే పిల్లలు ఫ్లోరోసిస్ బారిన పడకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ జి. నరేష్‌బాబు, సీనియర్ స్పైన్ సర్జన్, గుంటూరు

క్లుప్తంగా

ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం



బాపట్ల: ప్రజా ఉద్యమాల ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి పిలుపునిచ్చారు. రైతాంగం, కార్మికులపై భారం వేస్తూ దోపిడీ శక్తుల ప్రయోజనాల కోసం కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రమైన బాపట్లలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో రమాదేవి మాట్లాడారు. జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు టి.కృష్ణమోహన్ అధ్యక్షత వహించిన సభలో ఆమె మాట్లాడుతూ.. ఉద్యమాల ద్వారా ప్రజల పక్షాన పోరాటం చేయొచ్చు అన్నారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. బాబురావు మాట్లాడుతూ.. దేశంలో కార్పొరేట్ అనుకూల మతోన్మాద విధానాలతో ప్రజలపై భారం పడుతోందన్నారు. కులాల మధ్య చిచ్చు రేపుతున్నారన్నారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ మజుందార్, ఎన్.బాబురావు, సీహెచ్ మణిలాల్, ఎం.కొండయ్య, వి. వెంకట్రామయ్య, బి.తిరుమల, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సామర్థ్యానికి మించి ఇసుక రవాణా

తెనాలి: ఇసుక తవ్వకాల్లో నిబంధనలు అతిక్రమించడంతో పాటు ఇసుక రవాణాలోనూ ఉల్లంఘనలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. భారీ వాహనాల్లో కెపాసిటీకి మించి రవాణా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. భారత్ బెంజ్, టాటా బెంజ్ వంటి భారీ వాహనాల్లో ఇప్పుడు ఇసుక రవాణా ఎక్కువగా జరుగుతోందని తెలిసిందే. వీటి కెపాసిటీ 17–18 టన్నులు మాత్రమే. ఇందుకు భిన్నంగా ఒక్కో వాహనంలో రూ.40 టన్నులు, అంతకుమించిన పరిమాణంలోనూ రవాణా చేస్తున్నారు. వాహనం బాడీకి పైన దాదాపు మీటరు ఎత్తులో లోడింగ్ చేస్తున్నారు. పైన పట్టా కప్పి మరీ గమ్యస్థానానికి రవాణా చేస్తున్నారు.

వాహనదారులకు అవస్థలు

ప్రతిరోజూ పరిమితికి మించిన లోడింగ్‌తో ఇసుక రవాణా వాహనాలు తెనాలి మీదుగా వెళుతున్నాయి. ఇసుక జారిపోతున్నా, వెనుక వచ్చే ద్విచక్రవాహన దారులకు ఇబ్బందిగా ఉంటున్నా ఎవరికీ పట్టటం లేదు. కొద్దిరోజుల కిందట వైకుంఠపురం దేవస్థానం సమీపంలోని రైల్వే లోబ్రిడ్జి వద్ద వాహనాల నుంచి ఇసుక జారిపోయి ప్రజలు ఇబ్బది పడ్డారు. కెపాసిటీ మించిన పరిమాణంతో ఇసుకను తరలిస్తున్న భారీ వాహనాలతో రోడ్లు, కల్వర్టులు దెబ్బతింటున్నాయి. తెనాలి పట్టణంలోంచి వాహనాలు ప్రతిరోజూ పట్టపగలే వెళుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోక పోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు.

చీరాల చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- మద్దతుగా 26 మంది కౌన్సిలర్ల తీర్మానం
- వైస్ చైర్మన్‌పైనా నెగ్గిన అవిశ్వాసం
- ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే, ఎంపీలు హాజరు

చీరాల: చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై కూటమి కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మాన కార్యక్రమానికి ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లు హాజరయ్యారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా చీరాల ఆర్డీఓ టి.చంద్రశేఖర్ నాయుడు వ్యవహరించారు.

నాలుగు సంవత్సరాలపాటు చైర్మన్‌గా పనిచేసిన చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు టీడీపీ మద్దతు కౌన్సిలర్లతోపాటు ఆమంచి వర్గానికి చెందిన కౌన్సిలర్లు మొత్తం 22 మంది సంతకాలు చేసిన వినతిపత్రాన్ని గత నెల 23న జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళికి 17 మంది కౌన్సిలర్లు అందించారు. వారితో కూడా కలిపి చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సంఖ్యా బలం 24 ఉండడంతో అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించేందుకు ఈ నెల 14వ తేదీని కలెక్టర్ ఖరారు చేసిన విషయం విదితమే.

చైర్మన్ పదవికి రాజీనామా..

బుధవారం ఉదయం చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆర్డీవోకు తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఉదయం 10 గంటలకు అధికారులు అవిశ్వాస తీర్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తీర్మానానికి 24 మంది కౌన్సిలర్లు, ఇద్దరు ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి 26 మంది పాల్గొని మూజువాణి పద్ధతిలో అనుకూలంగా ఓటు వేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన తర్వాత మరో ఇద్దరు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కూటమికి మద్దతుగా నిలిచారు. అనంతరం 12.30 గంటలకు వైస్‌చైర్మన్–1పై అవిశ్వాస తీర్మానానికి 24 మంది కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి 26 మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఓట్లు వేశారు.



కౌన్సిలర్లను మాత్రమే లోపలికి అనుమతిస్తున్న పోలీసులు

మీడియాకు అనుమతి నిరాకరణ

అవిశ్వాస తీర్మాన కార్యక్రమానికి మీడియాను అనుమతించలేదు. దీంతో కార్యాలయం ఎదుట రోడ్డుపైనే ఎండలోనే మీడియా ప్రతినిధులు ఉండిపోయారు. గదిని కేటాయించాలని కోరినా అనుమతులు లేవంటూ లోనికి రానివ్వలేదు. రెండు గంటలపాటు రోడ్డుపైనే వేచి ఉన్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత అధికారులు లోపలికి పిలవడంతో, బయటనే ఉంటామని జర్నలిస్టులు చెప్పారు. ఎమ్మెల్యే, ఎంపీలు బయటకు వచ్చి అవిశ్వాస తీర్మాన విషయాలను మీడియాకు వివరించారు. ఎన్నడూ లేని విధంగా కార్యాలయంలోనికి కూడా అనుమతించకపోవడం ఏంటని ఎమ్మెల్యే, ఎంపీల ఎదుట జర్నలిస్టులు వాపోయారు.

తేదీ ఖరారు తర్వాత ఆపలేం...

అనంతరం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఎంపీ టి.కృష్ణప్రసాద్‌లు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అవిశ్వాస తీర్మానం నిర్వహించేందుకు తేదీ ఖరారు అయిన తర్వాత చైర్మన్ వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి చేరారన్నారు. అయితే పార్టీలోకి ఆయనను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అవిశ్వాసం తీర్మానం రోజున చైర్మన్ పదవికి రాజీనామా చేయడం సరికాదన్నారు. ముందే రాజీనామా చేస్తే అవిశ్వాస తీర్మానం ప్రక్రియ ఉండేదే కాదన్నారు. అవిశ్వాసానికి తేదీ ఖరారు చేసిన తర్వాత ఆ ప్రక్రియను ఆపడం జరగదని, అలానే కూటమి కౌన్సిలర్లు అభిప్రాయానికి తమ మద్దతు పలికామన్నారు. చైర్మన్‌గా ఉన్న ఆయన హయాంలో వార్డులలో అభివృద్ధి కుంటుపడిందని కౌన్సిలర్లు చెబుతున్నారన్నారు. భవిష్యత్‌లో కూటమి కౌన్సిలర్ల సహకారంతో చీరాల మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకారం అందిస్తామన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్, ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ అవిశ్వాస తీర్మాన కార్యక్రమాన్ని నియమనిబంధనల మేరకు నిర్వహించామన్నారు. వివరాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఎలక్షన్ కమిషన్ నుంచి వచ్చే ఆదేశాల మేరకు తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను త్వరలో నిర్వహిస్తామన్నారు. అవిశ్వాసం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కార్యాలయం బయటకు వచ్చి రోడ్డుపైనే మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం



యద్దనపూడి: మండలంలో బుధవారం సాయత్రం ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు బలంగా వీచాయి. కొద్దిపాటి వర్షం కూడా పడింది. మండలంలోని పోలూరు గ్రామంలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. చెట్టుపక్కన ఉన్న వరిగడ్డి వామి కూడా కొద్ది మేర కాలిపోయింది. గ్రామం నడిబొడ్డున ఉన్న చెట్టుపై పిడుగు పడినా ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు ఆ శబ్దానికి భయపడిపోయారు. మంటలు చెలరేగకుండా ఆర్పివేశారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

యద్దనపాడు: పిడుగు పాటుకు మహిళ బుధవారం మృతి చెందింది. మండలంలోని కారుచోల గ్రామానికి చెందిన 15 మంది మహిళలు మిర్చికోతకు వెళ్లారు. సాయంత్రం ఉరుములు, మెరుపులు రావడంతో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో సమీపాన పిడుగు పడిన భారీ శబ్దం విని వారిలో ముగ్గురు మహిళలు కింద పడిపోయారు. వారిలో షేక్ పర్వీన్(35) చెవుల నుంచి రక్తం కారి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు స్పృహ కోల్పోయారు. మృతురాలి భర్త షేక్ సైదావలి దివ్యాంగుడు. తాపీ పనులు చేస్తుండగా, వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

పూలంగి సేవతో పవళింపుము స్వామీ!

- రంగనాథుడికి అంగరంగ వైభవంగా పుష్పయాగం
- సొలస ఆలయంలో ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ

యద్దనపాడు: మండలంలోని సొలస గ్రామంలో శ్రీభూ సమేత రంగనాయక స్వామి ఆలయం బుధవారం భక్తజనంతో కళకళలాడింది. ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు కైంకర్యాల నిర్వహణ అట్టహాసంగా నిర్వహించారు. బుధవారం వేకువజామునే రంగనాథస్వామికి ఎన్నోరకాల పుష్పాలను భక్తులు మేళతాళాలతో భజాభజంత్రీలతో గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అర్చకులు పర్చూరి రామకృష్ణమచార్యులు ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పూలంగి సేవలు అందించారు. హోమపూజల్ని ముగించారు. సాయంత్రం అత్యధిక మంది భక్తులు పాల్గొని ద్వాదశ ప్రదక్షిణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పవళింపు సేవ చేశారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. ఆయా కార్యక్రమాలను ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు, అర్వపల్లి బ్రదర్స్, గ్రామపెద్దలు పర్యవేక్షించారు.



పూలంగి సేవకు పలు రకాల పుష్పాలను తెస్తున్న భక్తులు



పుష్పాలంకరణలో రంగనాయక స్వామి

బులియన్ అమ్మకాల్లో నిబంధనలు పాటించాలి

నెహ్రూనగర్: బంగారు వస్తువుల అమ్మకాల్లో లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎస్ మాధురి తెలియజేశారు. పట్నంబజార్‌లోని గుంటూరు బులియన్ జ్యుయలరీ అండ్ పాన్ బ్రోకర్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బులియన్ లావాదేవీల్లో మిల్లీగ్రామ్‌కు కూడా కచ్చితమైన వేయింగ్ మెషిన్ వాడాలని సూచించారు. బిల్లు క్యారటేజ్ అనుగుణంగా ఉండాలని తెలిపారు. బంగారానికి గ్రాము ధర ఉండాలన్నారు. రాళ్లు పొదిగిన ఆభరణాల బిల్లులో బంగారానికి, రాళ్లకు వేరుగా, పరిమాణం, చెల్లించాల్సిన పైకం కూడా వేర్వేరుగా ఉండాలని సూచించారు. బంగారం వెయిట్ చూసే ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషిన్‌ను ప్రతి సంవత్సరం విధిగా లీగల్ మెట్రాలజీ వారితో ధ్రువీకరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలేంరాజు, అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎండ భగభగ.. నీడకు పద పద..!

ఎండలు తీవ్రంగా ఉండటంతో మనుషులే కాదు.. మూగజీవాలు కూడా ఎక్కడ కాస్త నీడ దొరుకుతుందా.. అని వెళ్లి సేద తీరుతున్నాయి. రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేయడంతో పశువులకు మేత ఎక్కువగా ఉండటంతో పల్నాడు గ్రామాల నుంచి పశువులు వలస తీసుకొచ్చారు. చిత్రంలో చుండూరు మండలంలోని యద్లపల్లి గ్రామంలో ఎండ వేళ చెట్టు కింద ఆవులు సేద తీరుతున్న దృశ్యం

– చుండూరు(వేమూరు)

చిన్నారి మేధావి ప్రదీప్ నారాయణకు అరుదైన గుర్తింపు



తెనాలి: రూరల్ మండలం గుడివాడకు చెందిన చిన్నారి మేధావి బండికళ్ల ప్రదీప్‌నారాయణకు మరో గౌరవం దక్కింది. ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ 'ఇంటర్నేషనల్ బెస్ట్ అచీవర్ అవార్డు' లభించింది. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, ఎంఎస్ఎంఈ, నీతి అయోగ్‌ల సహకారంతో ఫౌండేషన్ ఇటీవల విశాఖపట్నంలోని ప్రెస్‌క్లబ్‌లో ఇంటర్నేషనల్ సోషల్ అవార్డ్స్ ప్రదానోత్సవం నిర్వహించింది. ఇందులో ప్రదీప్‌నారాయణకు ఈ గౌరవాన్ని అందజేశారు. ప్రస్తుతం నాలుగేళ్ల వయసున్న చిన్నారి 23 నెలల వయసు నుంచే అద్భుత జ్ఞాపకశక్తిని ప్రదర్శిస్తున్నాడు. తొలుత 150 పైగా వస్తువులు, కూరగాయలు, పక్షుల పేర్లను చెప్పాడు. ప్రస్తుతం 500 పైగా జంతువులు, వాహనాలు, జెండాలు, ఆకారాలు, రంగులు, ఫలాలు, కూరగాయలు, శరీర భాగాలు, ఆటబొమ్మలు, వస్త్రధారణ వంటి విభిన్న అంశాలను గుర్తించి చెప్పగలిగిన ప్రతిభను సొంతం చేసుకున్నాడు. భారత జాతీయ గీతాన్ని కేవలం 52 సెకన్లలోనే శ్రద్ధగా పాడుతున్నాడు.

నరసరావుపేటలో 'సింగిల్' బృందం సందడి

నరసరావుపేట ఈస్ట్: మండే వేసవిలో చల్లదనాన్ని అందించి హాయి గొలిపేలా సింగిల్ సినిమా ప్రేక్షకుల ఆదరణతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుందని ఆ సినిమా హీరో శ్రీవిష్ణు తెలిపారు. సింగిల్ సినిమా విజయ యాత్రలో భాగంగా బుధవారం చిత్ర యూనిట్ పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సందడి చేసింది. సినిమాను ప్రదర్శిస్తున్న కాసు మాల్‌లోని గీతా మల్టీప్లెక్స్‌లో థియేటర్‌లో హీరో శ్రీవిష్ణు, హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానా, దర్శకుడు కార్తీక్ రాజులు సందడి చేసారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ, వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని కుటుంబ సమేతంగా సినిమాను చూసేలా కామెడీ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు కార్తీక్ రాజు ప్రేక్షకులకు అందించారని తెలిపారు. తనకు తాను తన జీవితాన్ని మలచుకునేలా, తనకు నచ్చిన రీతిలో జీవితంలో ఎదగాలని సూచించేలా సినిమా నిర్మించినట్టు తెలిపారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై సినిమా చేయటం, అది బ్లాక్‌బస్టర్ కావటం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. దర్శకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ, సింగిల్ సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. సినిమాలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులను నవ్విస్తుందన్నారు.

హెచ్ఐవీ మహిళలకు క్యాన్సర్ పరీక్షలు

ఏర్పాట్లపై నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో ఏపీ శాక్స్ అధికారుల పర్యటన

నరసరావుపేట: స్థానిక ఏరియా వైద్యశాలలో హెచ్ఐవీతో జీవిస్తున్న మహిళలకు త్వరలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) విభాగంతో కలిసి ఎయిడ్స్ కంట్రోల్ అధికారులు దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ శాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.అంకినీడుప్రసాదు, డీడీ సీఎస్‌టీ డాక్టర్ చక్రవర్తి, పెప్‌ఫార్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాదు షేర్ ఇండియా అధికారులు డాక్టర్ జయకృష్ణ బుధవారం ఏరియా వైద్యశాలను సందర్శించి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌కుమార్, గైనకాలజీ విభాగ అధిపతులతో ఈ అంశంపై చర్చించారు. క్యాన్సర్ వ్యాధి స్క్రీనింగ్ చేయటం వలన హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి త్వరగా షుగర్, బీపీ, క్యాన్సర్ గుర్తించి ముందుగానే చికిత్స ప్రారంభించటం తద్వారా వారి జీవితకాలం పొడిగించే అవకాశం ఉన్నందున దీనికి కావాల్సిన సహాయసహకారాలు అందజేసేందుకు తాము సిద్ధమని హాస్పిటల్ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ కె.ఏడుకొండలు, డాక్టర్ దయానిధి, గైనకాలజీ డాక్టర్ మంత్రూనాయక్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద పాల్గొన్నారు.



సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌తో సమావేశమైన ఏపీ శాక్స్ అధికారులు

పవర్ లిఫ్టర్ షానూన్‌కు సత్కారం

తెనాలి: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన ఆసియన్ సబ్ జూనియర్, జూనియర్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సహా నాలుగు పతకాలు సాధించిన మదిర షానూన్‌ను బుధవారం స్థానిక కేవీఐకే జిమ్‌లో సత్కరించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త, డబుల్‌హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల మోహన్‌శ్యాం ప్రసాద్ హాజరయ్యారు. షానూన్‌ను సత్కరించారు. ఆమె విజయాలు క్రీడాలోకానికి స్ఫూర్తినిచ్చేవని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. జిమ్ శిక్షకురాలు, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ ఘట్టమనేని సాయిరేవతి మాట్లాడుతూ తెనాలికి చెందిన షానూన్ కేఎల్ యూనివర్సిటీలో బీబీఎస్ డిగ్రీ చదువుతూ, తెనాలి కేవీఐకే జిమ్‌లో సాధన చేస్తోందని చెప్పారు. రాష్ట్ర, జాతీయస్థాయి పతకాలను సాధించిన తర్వాత తొలిసారిగా ఆసియా స్థాయి పోటీల్లో జూనియర్స్ విభాగంలో 47 కిలోల కేటగిరీలో పోటీ పడిందని తెలిపారు. పతకాలను సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.



షానూన్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న మోహన్ శ్యాంప్రసాద్